
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 165 | మే 25, 2025 | వెల : రూ.3-00



**మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించండి**

4లో..



## కాంగ్రెస్ ప్రభుత్వంలో జోడెడ్లలా సంక్షేమం..!

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి
- నిర్ణీత గడువు లోపు గ్రామాలలో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**వేద న్యూస్, ఖమ్మం :**

కాంగ్రెస్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లల పాలన సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం కూసుమంచి మండలాల్లో శనివారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా నుండి మన్నెగూడెం వరకు 3.75 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, పాతర్లపాడు క్రాస్ రోడ్ నుండి రావి చెట్టు తండా రోడ్డు వరకు రూ.27 కోట్ల అంచనా విలువతో రెండు వరుసల రహదారిగా అభివృద్ధి పరుచు పనులు, మహ్మదాపురంలో బోడతండ నుండి సుబ్లేడు, మేడిదపల్లి రోడ్డు నుండి భవాని గుడి వరకు రూ.3.15 కోట్లతో బిటి రోడ్డు, తెట్టెలపాడు గ్రామంలో ఏడు అంతర్గత సిసి రోడ్లు, గోపాలపురం నుండి జల్లేపల్లి వరకు రూ.38 కోట్లలతో రెండు వరసల రహదారి పనులకు, చిన్న పోచారం నుండి కిష్టాపురం తాళ్ళచెరువు జెడ్పి రోడ్డు వరకు రూ.2.80 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జీళ్ళచెరువు గ్రామంలో సూర్యాపేట- అశ్వరావుపేట రోడ్డు నందు రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామం, మండలంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధి పనులు సైతం చేపట్టామని, పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి లకు

మిగతా 4వ పేజీలో..




# అభివృద్ధి వేగం పెరగాలి



- రాష్ట్రాలకు ప్రధాని సూచన
- వికసిత్ భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యం
- 2027నాటికి వికసిత్ భారత్: నీతి ఆయోగ్ సమావేశంలో మోడీ

**వేద న్యూస్, డెస్క్ :**

వికసిత్ భారత్ ప్రతి ఒక్కరి లక్ష్యమని..ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే దేశం కూడా అభివృద్ధి చెందుతుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్ష అని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రాష్ట్రాల సీఎంలు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధాని మోదీ మొదటిసారి సమావేశమయ్యారు.

శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం ఢిల్లీలో జరిగింది. అభివృద్ధి వేగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సూచించారు. 2027 నాటికి వికసిత్ భారత్‌గా అవతరించేందుకు రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందాలనే థీమ్‌తో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీం ఇండియా లాగా కలిసి పని చేస్తే ఏ లక్ష్యమూ కష్టం కాదని, అసాధ్యమనేది ఉండదని పేర్కొన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి రోడ్ మ్యాప్ గురించి చర్చించారు. దేశంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నగరాల నిర్మాణం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆవిష్కరణ, స్థిరత్వం అనేది నగరాల అభివృద్ధికి చోదక శక్తులుగా ఉండాలని సూచించారు. కాగా ఈ సమావేశానికి చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, యోగి ఆదిత్యనాథ్, సుఖ్విందర్ సింగ్ సుక్కూ, ఎంకే స్టాలిన్, హేమంత్ సోరన్ సహా పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్రపాలిత ప్రాంతాల గవర్నర్లు హాజరయ్యారు. అలాగే, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో పాటు నీతి ఆయోగ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భారత్ మరింత అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు సాగుతున్న ప్రస్తుత సమయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య మరింత సమన్వయం, సహకారం, సమాఖ్య స్ఫూర్తి అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రాలను కేవలం ప్రయోగశాలలుగా మాత్రమే కాకుండా జాతీయ వృద్ధికి అవసరమైన చోదక శక్తిగా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సహకార ఫెడరలిజమ్ శక్తిని వినియోగించి సమానత్వం, న్యాయం, శ్రేయస్సుతో పాటు అందరికీ సమాన అవకాశాలు అందించే భారతదేశాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. దేశ సమగ్రాభివృద్ధి, తెలంగాణ పునర్నిర్మాణానికి అనుసరిస్తున్న విధివిధానాలు, భవిష్యత్తు లక్ష్యాలను సమగ్రంగా వివరించారు. తెలంగాణ రైజింగ్‌తో ప్రగతి పథంలో ముందుకు సాగుతున్న తెలంగాణ మాడల్‌ను సమావేశంలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో చేపట్టిన అనేకానేక కార్యక్రమాలను సమగ్రంగా వివరించి అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు ఆర్థిక చేయూతను అందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ఆర్థిక,

మిగతా 4వ పేజీలో..




# సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే..

- వరంగల్ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్

**వేద న్యూస్, నల్లబెల్లి :**

సమాజాన్ని నిర్మించే నిర్మాతలు ఉపాధ్యాయులే అని వరంగల్ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ అన్నారు. నల్లబెల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న 5 రోజులు ప్రైమరీ ఉపాధ్యాయుల శిక్షణను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని కోరారు. ఐదు రోజులుగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాల గొప్పతనాన్ని గ్రామాల ప్రజలకు వివరించి పిల్లల నమోదును పెంచ డానికి ప్రయత్నం చేయాలని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. పాఠశా లల్లో నమోదును ఎలా పెంచాలో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రానున్న కాలంలో విద్యా రంగంలో మార్పులు రానున్న తరుణంలో ఆ దిశగా మన బోధనలో మార్పులు తీసుకురావాలని కోరారు. గ్రామాల్లోని మహిళా సంఘాలు, యువజన సంఘాల సహకారంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదును





పెంచాలని కోరారు. గ్రామీణుల్లో ఆర్థికపరమైన క్రమశిక్షణను అర్థం చేయించినట్లయితే వారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చుతారని హితబోధ చేశారు. అలాగే పాఠశాల ప్రారంభం నాటికే ప్రతీ ఉపాధ్యాయుడు గ్రామంలోని ప్రతీ ఇంటిని సందర్శించి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేలా తమ కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బెస్ట్ టీచర్స్ యొక్క పని విధానాన్ని అందరికీ వివరించారు. వృత్యంతర శిక్షణను వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎం ఈ వో అనురాధ అధ్యక్షత వహించారు.

### విద్యార్థుల స్థాయికి ఎదిగి బోధించాలి



ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయికి ఎదిగి బోధించాలని డైట్ రిటైర్డ్ లెక్చలర్ సోమయ్య అన్నారు. ఉపాధ్యాయుల శిక్షణలో భాగంగా ఉదయం జరిగిన సెషన్‌లో ఆయన పాల్గొని ఉత్తేజిత ప్రసంగం చేశారు. విద్యార్థుల్లో జ్ఞాన నిర్మాణానికి పెద్దపీట వేయాలని కోరారు. విద్యా బోధనలో ఉపాధ్యాయుడు అసలు రాజీ పడొద్దని పిలుపునిచ్చారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఆర్పీలు, ఎస్ఆర్పీలు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఓంకార్ నిర్మించిన ఎంసిపిఐ పేరుతో కార్యక్రమాలు చేస్తే ఊరుకోం..

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో ఐక్యతకు కృషి చేస్తుంటే స్వార్థ ప్రయోజనాల కోసం ఎంసిపిఐ పేరుతో మహాసభ నిర్వహించడం సరైంది కాదని తక్షణమే అలాంటి పద్ధతులు మానుకోకపోతే ఉపేక్షించేది లేదని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. శనివారం వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యకర్తల విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన స్థానిక ఓంకార్ భవన్ లో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గాదగోని రవి మాట్లాడుతూ వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు మార్క్సిస్టు మహానాయకుడు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ గారు నిర్మించిన ఎంసిపి, ఎంసిపిఐ మరియు ఎంసిపిఐ(యు) పార్టీలను పార్టీ కార్యక్రమానికి క్రమశిక్షణకు కట్టుబడి నిర్మాణాయుతంగా నిలబడిన వారసులకు మాత్రమే ఉచ్చరించి ఉపయోగించుకునే అర్హత ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో కమ్యూనిస్టుల ఐక్యత రీత్యా ఎంసిపిఐ నుండి ఎంసిపిఐ(యు)గా అవతరించి దేశవ్యాప్తంగా పనిచేస్తున్నదని ఇతర కమ్యూనిస్టు పార్టీలతో ఐక్యత కోసం శక్తికి మించి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ క్రమశిక్షణకు లోబడకుండా వెలివేయబడి గత దశాబ్ద కాలంలో తమ ఇష్టానుసారంగా పనిచేస్తూ పాలక పార్టీలకు లొంగిపోతూ ఇప్పుడు మళ్లీ కొత్తగా మోర్తాల చందర్ రావు లాంటి వ్యక్తులు ఎంసిపిఐ పార్టీ ప్రథమ మహాసభలంటూ ప్రజలను గందరగోళపరుస్తూ ఓంకార్ ఎన్నో ఆశలు ఆశయాలతో ఆకాంక్షలతో నిర్మించిన పార్టీని వారి ప్రతిష్టను అప్రతిష్ట పాలు చేసే చర్యలకు పూనుకోవడం సరైనది కాదన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ నుండి విడిపోయిన వ్యక్తులు అందరిని ఐక్యం చేసే దిశలో ప్రత్యేక కృషి జరుగుతున్న సందర్భంలో ఐక్యతను విచ్ఛిన్నం చేసే విధంగా వరంగల్ లో చందర్ రావు లాంటి వ్యక్తులు ఎంసిపిఐ పేరుతో మహాసభలు

మిగతా 4వ పేజీలో..

# విజయవాడలో బాంబు కలకలం

**వేద న్యూస్, విజయవాడ :**

విజయవాడలో బాంబు బెదిరింపు కాల్స్ కలకలం రేపాయి. నగరంలోని రైల్వే స్టేషన్‌తో పాటు బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టినట్లుగా కంట్రోల్ రూమ్‌కు వేర్వేరు ఫోన్ కాల్స్ వచ్చాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆయా ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముందుగా బీసెంట్ రోడ్డులోని ఎల్ఐసీ బిల్డింగ్‌లో బాంబు పెట్టినట్లుగా ఓ ఆగంతకుడు శనివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో విజయవాడ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. బాంబ్ స్క్వాడ్‌తో కలిసి నాలుగు బృందాలుగా ఏర్పడి బందర్ రోడ్డు నుంచి ఏలూరు రోడ్డు వరకు బీసెంట్ రోడ్డులో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బాంబు బెదిరింపు కాల్ నేపథ్యంలో బీసెంట్ రోడ్డులోని అన్ని షాపులను మూసివేయించారు. సాధారణ ప్రజలు, వ్యాపారులు ఎవరూ ఈ రోడ్డులోకి రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బీసెంట్ రోడ్డులోని షాపులు, తోపుడు బండ్లను క్షుణ్నంగా తనిఖీ చేశారు. ఎక్కడా బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఫేక్ కాల్ అని తేలడంతో మధ్యాహ్నం నుంచి బీసెంట్ రోడ్డులో వ్యాపారాలకు




స్టేషన్‌కు కూడా బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. పాకిస్థాన్‌కు చెందిన హుస్సేన్ అని పేరు చెప్పుకుంటూ హిందీలో ఫోన్ కాల్ మాట్లాడటంతో అప్రమత్తమైన జీఆర్‌పీ, సీఎస్‌డబ్ల్యూ, బాంబు స్క్వాడ్ బృందాలు రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫోన్ కాల్‌ను ట్రేస్ చేసిన టెక్నికల్ టీమ్.. దాన్ని ఫేక్ కాల్‌గా నిర్ధారించారు.

## జ్యోతి మల్హోత్రా కేసులో వెలుగులోకి కీలక విషయాలు



**వేద న్యూస్, డెస్క్:**

భారతదేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. యూట్యూబ్ వీడియోల చిత్రీకరణ పేరుతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించగా, గతంలో పూరీ జగన్నాథ ఆలయంతో పాటు ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయాన్ని కూడా సందర్శించినట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా, పూరీ ఆలయంపై డ్రోన్ ఎగరవేయడం ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. అధికార వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, 2024లో జ్యోతి మల్హోత్రా పూరీకి చెందిన మరో యూట్యూబర్‌తో కలిసి శ్రీక్షేత్రాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఆమె ఆలయ పరిస రాల్లో డ్రోన్‌ను ఎగురవేసినట్లు అధికారులు గుర్తించారు. శ్రీక్షేత్రంపై ఉగ్రవాదుల దృష్టి ఉందంటూ ఇటీవల కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆలయంపైకి డ్రోన్‌ను ఎందుకు పంపారు, దాని ద్వారా ఎలాంటి దృశ్యాలను చిత్రీకరించారు అనే కోణంలో అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, గత సంవత్సరం ఏప్రిల్‌లో జ్యోతి మల్హోత్రా ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయాన్ని సందర్శించినట్లు మధ్యప్రదేశ్ పోలీసులు తెలిపారు. అయితే, అక్కడి విచారణలో ఇప్పటివరకు ఎలాంటి నేరారోపణలు నిర్ధార ణ కాలేదని, ఆమె ఏయే ప్రాంతాలకు వెళ్లింది, ఎక్కడ బస చేసింది అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు.

# భారత్‌లోకి అక్రమంగా వస్తూ.. బీఎస్ఎఫ్ కాల్పుల్లో పాకిస్థానీ హతం

- గుజరాత్ బనస్కాంత జిల్లాలో పాక్ జాతీయుడి చొరబాటు యత్నం
- అడ్డుకున్న బీఎస్ఎఫ్ జవాన్లపైకి దూసుకెళ్లిన ఆగంతకుడు

**వేద న్యూస్, డెస్క్:**

గుజరాత్‌లోని భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్తత నెలకొంది. దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఓ పాకిస్థాన్ జాతీయుడిని బీఎస్ఎఫ్ సిబ్బంది కాల్చి చంపారు. బనస్కాంత జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు బీఎస్ఎఫ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన కంచెను దాటుకుని ఒక వ్యక్తి భారత భూభాగంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించడాన్ని బీఎస్ఎఫ్ జవాన్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు అతడిని ఆగిపోవాల్సిందిగా హెచ్చరించారు. అయినప్పటికీ, ఆ వ్యక్తి హెచ్చరికలను ఖాతరు చేయకుండా ముందుకు రావడానికి ప్రయత్నించాడు. దీంతో, ఆత్మరక్షణ చర్యల్లో భాగంగా భద్రతా సిబ్బంది అతడిపై కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో సదరు పాకిస్థాన్ జాతీయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. ఇటీవలి పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బీఎస్ఎఫ్ దళాలు నిరంతర నిఘాతో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. తాజా ఘటనతో సరిహద్దు వెంబడి భద్రతను మరింత



పటిష్టం చేశారు.

# పాకిస్తాన్ జిందాబాద్ అంటూ పోస్ట్‌లు ఇద్దరు అరెస్టు

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

పాకిస్తాన్ జిందాబాద్ అంటూ మద్దతు పలుకుతూ.. సోషల్ మీడియాలో షేర్ చేసిన కేసు వెలుగులోకి వచ్చింది. అక్కడ సోషల్ మీడియాలో భారతదేశానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టేలా పోస్ట్ చేసినందుకు ఇద్దరు యువకులను ఉత్తర ప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు పోస్టులు వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఆ ఇద్దరు యువకులపై చర్యలు తీసుకుని వారిని అరెస్టు చేశారు. పోలీసుల ముందు చేతులు జోడించి క్షమాపణలు చెబుతూ కనిపించాడు. ఆ యువకుడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పాకిస్తాన్ జిందాబాద్ వంటి దేశ వ్యతిరేక వ్యాఖ్యలను పోస్ట్ చేశాడు. అదే సమయంలో, మరొక యువకుడు ఒక వీడియోను అప్‌లోడ్ చేశాడు. అందులో అతను పదునైన ఆయుధాన్ని ఊపుతూ కనిపిస్తాడు. అందులో ఒక్కొక్కరి నాలుకను కోస్తానని బెదిరించాడు. ఈ వీడియో, వ్యాఖ్య సోషల్ మీడియాలో త్వరగా వైరల్ అయ్యాయి. దీంతో గ్రామంలో ఆగ్రహం పెల్లుబికింది. ఈ పోస్టులు వైరల్ కావడంతో, సైద్‌పూర్ లష్కరీగంజ్ గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ప్రజలలో తీవ్ర ఆగ్రహం



పెల్లుబిక్కింది. కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ విషయంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించి నిందితులిద్దరినీ అరెస్టు చేశారు. బిథారి చైన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు యువకులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో, వారిద్దరూ ఉద్దేశపూర్వకంగా శాంతికి భంగం కలిగించే, సామాజిక వాతావరణాన్ని చెడగొట్టే ఇలాంటి పోస్టులను పోస్ట్ చేశారని స్పష్టమైంది. దీని తరువాత, పోలీసులు వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అరెస్టయిన యువకుల పేర్లు వాజిద్ షా, ఇర్ఫాన్ అలియాస్ అత్రజ్. ఇద్దరు యువకులు సైద్‌పూర్ లష్కరీగంజ్, పోలీస్ స్టేషన్ బిత్రి చైన్‌పూర్ గ్రామ నివాసితులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వారిద్దరూ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను దేశంలో ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి, సమాజంలో ఉద్రిక్తతను సృష్టించడానికి ఉపయోగించారు.

సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులకు దూరంగా ఉండాలని, అలాంటి సందేశం లేదా వీడియో చూసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే, శాంతిని కాపాడుకోవాలని అందరికీ విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన తర్వాత, వారు పోలీసుల ముందు చేతులు జోడించి కనిపించారు. తప్పు చేశామని క్షమించమని వేడుకున్నారు. పోలీసులు ఇద్దరి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఇప్పుడు ఇద్దరు నిందితులను జైలుకు పంపారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఎల్ఐసీ

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పేరు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకెక్కింది. 24 గంటల్లో 5,88,107 జీవిత బీమా పాలసీలు జారీ చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది ఎల్ఐసీ. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సంవత్సరం జనవరి 24న దేశవ్యాప్తంగా 4,52,839 మంది ఎల్ఐసీ ఏజెంట్లు కలిసి 24 గంటల్లో మొత్తం 5,88,107 జీవిత బీమా పాలసీలను జారీ చేశారని, ఇది ఓ ప్రపంచ రికార్డు అని జీవిత బీమా సంస్థ తెలిపింది. ఈ ఘనత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైనని పేర్కొంది. ఇది ఘనత తమ ఏజెంట్ల అంకితభావం, నైపుణ్యం, అవిశ్రాంత కృషికి నిదర్శనమని ఎల్ఐసీ చెప్పుకొచ్చింది. ఈ గొప్ప ప్రయత్నం కేవలం 24 గంటల్లోనే జీవిత బీమా పరిశ్రమలో కొత్త ప్రపంచ ప్రమాణాన్ని నెలకొల్పిందని.. ఈ విజయం మా కస్టమర్లకు, వారి కుటుంబాలకు కీలకమైన ఆర్థిక భద్రతను అందించే మా లక్ష్యం పట్ల తమ లోతైన నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఈ రికార్డు కోసం ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ్ మొహంతి చొరవ చూపారు. ఈ ఏడాది జనవరి 20న





'మ్యాడ్ మిలియన్ డే' రోజున ప్రతి ఏజెంట్ కనీసం ఒక పాలసీని పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మ్యాడ్ మిలియన్ డే'ని చారిత్రాత్మకంగా మార్చినందుకు కస్టమర్లు, ఏజెంట్లు, ఉద్యోగులకు మొహంతి కృతజ్ఞతలు తెలిపారు.

## వైసీపీ కేంద్ర కార్యాలయం వద్ద నిప్పు పెట్టిన దుండగులు

**వేద న్యూస్, డెస్క్ :**

తాడేపల్లిలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం సమీపంలో మరోసారి అగ్నిప్రమాదం జరగడం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ కార్యాలయం దగ్గర ఉన్న పచ్చదనానికి నిప్పుపెట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వైసీపీ కేంద్ర కార్యాలయానికి దగ్గర్లో ఉన్న గ్రీనరీలో అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే




సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై వైసీపీ కార్యాలయ సిబ్బంది తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యకు పాల్పడి ఉంటారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. గతంలో కూడా ఇదే తరహాలో రెండుసార్లు అగ్నిప్రమాదాలు జరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన మొదటిసారి ఇలాంటి ఘటనే చోటుచేసుకోగా, ఆ మరుసటి రోజే, అంటే ఫిబ్రవరి 6న, పార్టీ ఆఫీసు ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఘటనకు సంబంధించి సీసీ కెమెరా ఫుటేజ్‌ను అందించాలని పోలీసులు ఫిబ్రవరి 7న పార్టీ కార్యాలయానికి నోటీసులు ఇచ్చారు. అయితే, ఆ రోజు సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఫుటేజ్ అందుబాటులో లేదని వైసీపీ కార్యాలయ సిబ్బంది పోలీసులకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీంతో పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వరుసగా జరుగుతున్న ఈ అగ్నిప్రమాద ఘటనలు వైసీపీ శ్రేణుల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా, పోలీస్ స్టేషన్‌కు అనుసంధానమయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం.

# వాయుగుండం ఎఫెక్ట్.. ఏపీకి భారీ వర్షసూచన

**వేద న్యూస్, డెస్క్:**

తూర్పుమధ్య అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్ తీరానికి సమీపంలోని వాయుగుండం గడిచిన 6 గంటల్లో 5 కి.మీ వేగంతో తూర్పు వైపుకు నెమ్మదిగా కదులుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది రత్నగిరి సమీపంలో దక్షిణ కొంకణ్ తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు వివరించింది. మంగళవారం(27-05-25) నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతం ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు అధికారులు. తీరం వెంబడి గంటకు 40-50కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు. పిడుగులతో కూడిన వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇప్పటినుంచే ఉద్యానవన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సంపాదకీయం

నాలుగేళ్ల 'అగ్నిపథ్' ఎవరి కోసం?

భారత్‌కు ఏడు పొరుగు దేశాలతో భూ, సముద్ర సరిహద్దులున్నాయి. ఇవి వరుసగా 14,868 కిమీ, 7,000 కిమీ (మొత్తం 21,868 కిమీ). ఒక్క బంగ్లాదేశ్‌తోనే 4,026 కిమీ భూ సరిహద్దు ఉంది. వీటిలో చాలా వరకు కంచె గాని, బి.ఎస్.ఎఫ్ పహారా గాని లేదు. ఇక, పాకిస్తాన్‌తో 3,323 కిమీ సరిహద్దు ఉంది. భారత్‌కు పొరుగు దేశాలతో సత్సంబంధాలనేవి గతానికి సంబంధించినవి. సోవియట్ రష్యా పతనం తర్వాత, యుద్ధ పరిస్థితిలో భారత్‌కు ప్రత్యక్షంగా అండగా నిలిచే దేశం ప్రపంచంలో మరేదీ లేదు. పైగా దేశంలో సైన్యం వినియోగం పెరుగుతోంది! అంతే కాదు. త్రివిధ దళాలు ఒకేసారి యుద్ధంలో పాల్గొనడం అసాధ్యం. ఈ పరిస్థితుల్లో, సైన్యాన్ని బలహీనపరిచే ఒక ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టడం చాలా ప్రమాదకరం. ఈ చర్యను ఖండించాలి కూడా. భారత ఆర్మీ 12 లక్షల మంది సైనికులతో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద సైనిక దళం. ప్రతి సంవత్సరం 55,000 మంది సైనిక సిబ్బంది పదవీ విరమణ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సగటున 60,000 మంది సైన్యంలోకి నియమితులవుతున్నారు. దేశంలోనే అతి పెద్ద ఉద్యోగ సంస్థ సైన్యం. భారత సైనికుల శారీరక, మానసిక బలం, వృత్తి నైపుణ్యాలు, క్రమశిక్షణ, సామర్థ్యం, దేశభక్తి, త్యాగాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. దీనికి కారణం అధిక-నాణ్యత, దీర్ఘకాలిక సైనిక శిక్షణా పద్ధతులు. ఆర్మీ లోని ఒక్కో సైనికుడు ఏడు సంవత్సరాల పాటు అత్యంత కఠినమైన శిక్షణ పొందుతాడు. శిక్షణలో విజయం సాధించిన వారిని యుద్ధ భూమిలో సైనికులకు సహాయకులుగా నియమిస్తారు. అక్కడ అవసరమైన అనుభవాన్ని గడించడానికి సైనికులను సహాయకులుగా నియమిస్తారు. అప్పుడు వారు నేరుగా యుద్ధంలో పాల్గొనవచ్చు. సైనికులకు ఇటువంటి సుదీర్ఘ శిక్షణ ఇవ్వడమనేది చాలా సాధారణమైన విషయం. 15 సంవత్సరాలపాటు సైన్యంలో సేవ చేసిన ఒక సైనికుడు ఉద్యోగ విరమణ చేసినప్పుడు 7 సంవత్సరాల శిక్షణతో కూడిన 15 సంవత్సరాల పని అనుభవమున్న సైనికుడిని ఆర్మీ కోల్పోతుంది. కఠోరమైన వ్యాయామం, క్రమశిక్షణ, సమతుల ఆహారం, అనుకూలమైన పని వాతావరణం, ఐక్యతా భావం, దేశం కోసం పని చేయాలనే మక్కువ వంటివన్నీ పౌర సమాజంలోని తోటివారితో పోలిస్తే రిటైర్మెంట్ సమయంలో ఆర్మీ జవాన్ శారీరక, మానసిక ఆరోగ్యంతో చురుకుగా వుంటాడు. 32 నుంచి 36 ఏళ్ల మధ్య సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ చేయాలనే నియమాన్ని దేశ తొలి రక్షణ దళాధిపతి, దివంగత బిపిన్ రావత్ వ్యతిరేకించారు. వీరిలా నైపుణ్యం, క్రమశిక్షణ కలిగిన మానవ వనరులను మరో 15 సంవత్సరాలు ఉపయోగించడం ఆర్మీకి ఎంతో ప్రయోజనకరమని ఆయన విశ్వసించారు. 62 సంవత్సరాల వయస్సులో ఉన్న ఒక సైనిక అధికారి ఆశించిన సామర్థ్యం, నాణ్యత, వేగంతో సేవలను అందించగలిగినప్పుడు 32-36 సంవత్సరాల మధ్య వయస్సుగల జవాన్ ఏ కారణం చేత ఆవిధంగా పనిచేయలేడనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు పెంచాలని ఆయన ప్రభుత్వానికి లిఖితపూర్వక ప్రతిపాదనను సమర్పించారు. అయితే, సైనికుల రిటైర్మెంట్ వయస్సు, సైన్యం సగటు వయస్సు ఎంత ఉండాలనే దానిపై సైన్యంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

యుద్ధం ప్రజలకు హాని కలిగిస్తుంది. ఈ ప్రపంచం యుద్ధం నుండి విముక్తి పొందితే మంచిది. ప్రపంచంలో యుద్ధానికి, సైన్యానికి ఖర్చు చేసే భారీ మొత్తాన్ని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించినట్లయితే ప్రపంచ ముఖచిత్రమే మారిపోతుంది. కానీ దాడి, దురాక్రమణ, యుద్ధం నిజమైనప్పుడు, దేశ ప్రయోజనాల కోసం సైన్యానికి డబ్బు కేటాయించేందుకు ఏ దేశమూ ఏమాత్రం వెనుకాడదు. సైన్యం సగటు వయస్సు తగ్గింపును, సైన్యం మీద చేసే ఖర్చు తగ్గింపును కారణంగా చూపించిన మోడీ ప్రభుత్వం 2022 నుండి 'లెఫ్టినెంట్' స్థాయి కంటే దిగువన ఉన్న అన్ని శాశ్వత పోస్టులకూ నియామకాలను నిలిపివేసింది. 'అగ్నిపథ్' ద్వారా మాత్రమే సైనిక నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. వాస్తవం ఏమిటంటే%ౌ%సైన్యానికి, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ అగ్నిపథ్ ప్రాజెక్టును ఉపసంహరించు కోవాలని, సైన్యంలో భారీ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి%ౌ%వామపక్షాలు మినహా ఏ బిజెపి యేతర పార్టీ కూడా చొరవ తీసుకోలేదు. 17 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సుగల యువకులను 'అగ్నివీర్ ప్రాజెక్ట్' కింద 4 సంవత్సరాల పాటు సైన్యంలో నియమించుకుంటారు. ఏటా 46,000 మంది అగ్నివీర్ సిబ్బందిని నియమిస్తారు. వీరిలో 75 శాతం మంది (34,500) 4 సంవత్సరాల తర్వాత 25 సంవత్సరాల వయస్సులో రిటైర్ అవుతారు. మిగిలిన 25 శాతం మంది (11,500) 4 సంవత్సరాల తర్వాత శాశ్వత సైనిక సిబ్బందిగా నియమితులవుతారు. ఇతర శాశ్వత నియామకాలేవీ ఉండవు.

2019 జనవరి 1 నాటికి, సైన్యంలో 1,04,653 ఖాళీలు ఉన్నాయి. 2019 నుండి 2023 వరకు నాలుగు సంవత్సరాలలో శాశ్వత నియామకాలు జరగలేదు. 2025 వరకు శాశ్వత నియామకాలు ఉండవు. సంవత్సరానికి సగటున 55,000 ఉద్యోగ విరమణలతో 2026 జనవరి 1 నాటికి సైన్యంలో (1,04,653 ం 55,000 7) 4,89,653 ఖాళీలు ఉంటాయి. 12 లక్షల మంది సైనికుల స్థానంలో 7 లక్షల మంది సైనికులు ఎంత పని చేయగలరు? అత్యవసర సమయాల్లో సైన్యానికి సహాయం చేయగల సెంట్రల్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్‌లో 2022 జనవరి1 నాటికి 2,50,000 ఖాళీలు ఉన్నాయి. సైన్యంలో ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలున్న సమయంలో ఒకవేళ యుద్ధాన్ని ఎదుర్కోవాల్సి వస్తే! పౌర రక్షణ మాటేమిటి? దేశం ఇబ్బందుల్లో పడుతుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 2026 నుండి ఏటా 11,500 మంది అగ్నివీర్‌లను శాశ్వత స్థానాలకు నియమిస్తారు. చాలా పెద్ద సంఖ్యలో సైనికులు ఉద్యోగ విరమణ చేస్తారు. కాబట్టి 2026 నుండి, ఈ 7 లక్షలుగా వున్న సైన్యం సంఖ్య ప్రతి సంవత్సరం తగ్గుతూనే ఉంటుంది. మూడవది-నాలుగు సంవత్సరాల అగ్నివీర్ లను 6 నెలల నామ్ కే వాస్తే శిక్షణ తర్వాత నేరుగా యుద్ధానికి పంపుతారు. ఏడేళ్ల శిక్షణ తర్వాత సైన్యానికి సహాయకులుగా వెళ్లడానికి కేవలం ఆరు మాసాల శిక్షణతో సైనికులకు సహాయకులుగా పంపడానికి ఎంత వ్యత్యాసం వుంటుంది? ఇది ప్రత్యామ్నాయం అవుతుందా? యుద్ధం జరిగే అవకాశం ఉన్న దేశాలు తమ దళాల సంఖ్యను పెంచడంతో పాటు శిక్షణా వ్యవధిని, నాణ్యతను నిరంతరం మెరుగు పరుస్తున్నాయి. యుద్ధ భూమిలో సైనిక శిక్షణ పొందిన శత్రు సైనికులతో పోటీ పడటానికి 6 నెలల శిక్షణతో నాలుగేళ్ల కాంట్రాక్ట్ సైనికులు ఏ మంత్రదండాన్ని ఉపయోగిస్తారు? 2026 నుండి ఏటా 60,000 మందికి బదులుగా 11,500 మంది అగ్నిమాపక సిబ్బందిని శాశ్వత స్థానాలకు నియమిస్తారు. అంటే ఏటా 48,500 శాశ్వత నియామకాలకు అవకాశం తగ్గిపోతుంది. దేశ జనాభాలో 50 శాతం 24 ఏళ్ల లోపువారు. 65 శాతం మంది 35 ఏళ్ల లోపువారు. జనాభా సగటు వయస్సు 27.5 సంవత్సరాలు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి చూసినట్లయితే ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉపాధి దాదాపు సున్నా. ప్రభుత్వం సంవత్సరానికి ఉద్యోగ అవకాశాల సంఖ్యను 45,500కు తగ్గించడం ద్వారా నిరుద్యోగుల సంఖ్యను పెంచింది. ఇది ఉద్యోగార్థులను నిరాశపరిచింది. నాలుగేళ్ల తర్వాత రిటైర్ అయిన అగ్నివీర్ లకు ఎటువంటి పెన్షన్ లభించదు. 4 సంవత్సరాల సర్వీస్ సమయంలో తమ నెలవారీ జీతం నుండి 30 శాతం చొప్పున పక్కన పెట్టిన రూ.5,04,000 (వడ్డీని మినహాయించి), ప్రభుత్వం నుండి రూ.6,67,000 పొందుతారు. నాలుగేళ్ల సర్వీస్ తర్వాత, 21-25 సంవత్సరాల మధ్య వయస్సులైన అగ్నివీర్‌లు ప్రతి సంవత్సరం 37,500 మంది తమ ఉద్యోగాలను కోల్పోయి మళ్ళీ ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తారు. 25 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం చేస్తూ మళ్ళీ నిరుద్యోగిగా మారడం, నెలవారీ ఆదాయం పూర్తిగా ఆగిపోవడం ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి వున్న సమస్యలు. ఈ 4 సంవత్సరాలు వారికి చదువుకోవడానికి లేదా మరో ఉద్యోగానికి సిద్ధం కావడానికి అవకాశం ఉండదు. కాబట్టి ఈ అగ్నిపథ్ సిబ్బంది అత్యంత పోటీ వాతావరణం వున్న ఉపాధి మార్కెట్‌లో కొత్త ఉద్యోగాలను పొందలేరని భావించవచ్చు. వాస్తవానికి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉద్యోగ విరమణ చేసిన సైనిక సిబ్బందికి కేటాయించిన 92-95 శాతం స్థానాలు ఎల్లప్పుడూ ఖాళీగా ఉంటాయి.

# కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**వేద న్యూస్, కడప :**



కడప జిల్లాలోని గువ్వల చెరువు ఘాట్ ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. దాదాపు 14 కిలోమీటర్ల పైబడి ఉండే ఈ ఘాట్‌లో పదికి పైగా మలుపులు ఉన్నాయి. ఆ మలుపుల వద్ద స్పీడ్ కంట్రోల్ చేసుకోలేక ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అలాంటి సంఘటన ఇప్పుడు మరొకటి జరిగింది. బెంగళూరు నుంచి బద్వేల్‌లోని సొంత గ్రామానికి వస్తున్న ఓ కుటుంబం మృత్యువాత పడింది. గువ్వలచెరువు ఘాట్ లోని చింతకొమ్మదిన్నె మండలం వైపు ఉన్న నాలుగో మలుపు వద్ద ప్రమాదం సంభవించింది. యూరియా లోడ్ తో వస్తున్న లారీ వెనుక నుంచి వచ్చి కారుపైకి దూసుకువచ్చింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, కారు ఢీకొన్న ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని కడప రిమ్స్ కు తరలించారు. బెంగళూరు నుండి బద్వేల్ మండలం చింతపుత్తలపల్లె కు గ్రామంలో శుభకార్యానికి వెళు తుండగా ఈ ప్రమాదం జరిగింది. గువ్వలచెరువు ఘాట్ రోడ్డు నాలుగవ మలుపు వద్దకు కారు రాగానే వెనుక వైపు నుంచి యూరియా లోడ్ తో లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఆ వేగానికి లారీ కారుపై పడడంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు.

ఈ ప్రమాదానికి సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను శ్రీకాంత్, శిరీష్, హర్షిణి, రిషిగా పోలీసులు గుర్తించారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కారుపై పడ్డ లారీని తీసేందుకు దాదాపు రెండు గంటలకు పైగా శ్రమించారు. మొత్తం 7 మంది కారులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. యాక్సిడెంట్ ప్రదేశంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మృతదేహాలను వెలికి తీసి కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. గాయపడిన వారిని కూడా కడప రిమ్స్ కు తరలించారు.

# మైసూర్ పాక్‌ను మైసూర్ పాక్ అనే పిలవండి


**వేద న్యూస్, డెస్క్:**



పహల్గాం ఉగ్ర దాడి, ప్రతిగా ఆపరేషన్ సింధూర్ , ఆపై భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది దేశంపై యావత్ భారతీయులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో రాజస్థాన్ రాజధాని జైపూర్ లో ఓ స్వీట్ల షాపు యజమాని తన షాపులో మైసూర్ పాక్ పేరును 'మైసూర్ శ్రీ గా మార్చాడు. ఇది నెట్టింట్లో వైరల్‌గా మారింది. దాంతో దీనిపై రాయల్ కుక్ కకాసుర మడప్ప మునిమనవడు ఎస్ నటరాజ్ స్పందించారు. ఆయన ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ మైసూర్ పాక్ పేరు మార్పుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అది చారిత్రక వంటకమని, దాని పేరులోని పాక్‌కు, పాకిస్థాన్‌కు సంబంధం లేదని చెప్పారు. 'మైసూర్ పాక్‌ను మైసూర్‌పాక్ అనే పిలవండి. మన పూర్వీకులు అందించిన ఆవిష్కరణకు ఇంకో పేరు ఉండదు. కన్నడలో '%ఋఝుఞు%' అంటే చక్కర లేదా బెల్లంతో చేసే పదార్థం అని అర్థం. దీనిని తొలుత మైసూర్‌లో తయారు చేయడంవల్ల మైసూర్, పాకా కలిసి మైసూర్ పాక్ అని పేరు వచ్చింది. దీనిని వేరే పేరుతో పిలవడం అనవసరం. దీనికి వేరే అర్థాలు తీయొద్దు' అని నటరాజ్ కోరారు. మైసూర్‌లోని వడయార్ రాజకుటుంబానికి కకాసుర మడప్ప వంటవాడిగా ఉండేవారు. ఈ స్వీట్‌ను తొలుత తయారు చేసిన క్రెడిట్ ఆయనకే దక్కింది. మైసూర్ పాక్‌కు అప్పట్లో ఆయన పెట్టిన పేరును ఇప్పుడు మార్చడంపై నటరాజ్ అభ్యంతరం తెలియజేశారు. కాగా జైపూర్‌లోని ప్రముఖ 'త్యోహార్ స్వీట్స్' దుకాణం యజమాని.. మైసూర్ పాక్, మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్ పేర్లను.. మైసూర్ శ్రీ, మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీ అని మార్చాడు. స్వర్ణ భాషం పాక్, చాందీ భాషం పాక్‌ను కూడా స్వర్ణ శ్రీ, చాందీ శ్రీగా మార్చేశాడు. అయితే ఈ పేర్ల మార్పుపై 'త్యోహార్ స్వీట్స్' దుకాణం యజమాని అంజలీ జైన్ మాట్లాడుతూ.. 'దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల్లో ఉంటే సరిపోదు. ప్రతి పౌరుడికి దేశంపై ప్రేమ ఉండాలి. అందుకే మేం ఈ నిర్ణయం తీసుకున్నాం' అన్నారు. పాక్ అనే పదానికి పాకిస్థాన్‌తో సంబంధం లేకపోయినా ఆ శబ్దం పాకిస్థాన్‌ను గుర్తుచేసేలా ఉండటంతో పేరు మార్చినట్లు తెలిపారు. శుభానికి సూచికగా 'శ్రీ' అనే పదం పెట్టినట్లు చెప్పారు.

# జమ్ముకశ్మీర్ పోలీసులకు 'జంగిల్ వార్‌ఫేర్'లో శిక్షణ


**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



జమ్ముకశ్మీర్ లోని పహల్గాం లో గత నెల 22న ఉగ్రవాదులు దట్టమైన అటవీ ప్రాంతాన్ని అవకాశంగా తీసుకొని పర్యాటకులపై దాడిచేసి 26 మందిని బలిగొనడంతో.. అలాంటి ఉగ్రదాడులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో తొలిసారిగా జమ్ముకశ్మీర్‌లోని పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సిబ్బందికి జంగిల్ వార్‌ఫేర్ లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించింది. కశ్మీర్, ఇతర సరిహద్దు ప్రదేశాల్లోని పర్వత ప్రాంతాలు, ప్రమాదకరమైన అటవీ భూభాగాలపై అవగాహన ఉన్న ఉగ్రవాదులను ఎదుర్కోవడమే లక్ష్యంగా ప్రమాదకరమైన అటవీ ప్రాంతాల్లో పోలీసులకు యుద్ధ మెళకువల్లో శిక్షణనిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులకు శిక్షణనిచ్చే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, జమ్ముకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్‌కు అప్పగించినట్లు చెప్పారు. గతంలో ఎలైట్ యాంటీ-నక్సల్ గ్రేహౌండ్స్ కమాండర్‌గా పనిచేసిన ప్రభాత్ కశ్మీర్‌లోని ఎత్తైన ప్రదేశాల్లో సిబ్బందికి శిక్షణనిస్తున్నారు.

అధికారులు ఎస్ఓజీ బృందాలకు దేశంలోని ప్రమాదకర బహుళ ప్రదేశాలలో శిక్షణ ఇస్తున్నారు. కొన్ని బ్యాచ్‌లు ఇప్పటికే ముఖ్యమైన శిక్షణను పొందాయి. ఇందులో భాగంగా తెలంగాణలోని గ్రేహౌండ్స్, జంగిల్ వార్‌ఫేర్ స్కూల్, పంజాబ్‌లోని తల్వారాలోని వైట్ నైట్ కార్ప్స్ బేస్, కశ్మీర్‌లోని దోడాలోని కార్ప్స్ బాటిల్ స్కూల్స్ లలో పలు సెషన్‌లు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాల్లో సిబ్బందికి రోజుల తరబడి ప్రతికూల పరిస్థితులలో జీవించడం, శత్రువులను ట్రాక్ చేస్తూ దట్టమైన అడవులను నావిగేట్ చేయడం లాంటి వాటిలో శిక్షణ ఇస్తారు.

విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలోని అన్ని ప్రదేశాలపై అవగాహన ఉండేలా మ్యాప్‌ల సహాయంతో క్లిష్టమైన ప్రదేశాలకు త్వరగా చేరుకునేలా మెళకువలు నేర్పిస్తారు. అయితే పహల్గాం దాడి సమయంలో స్థానికంగా నిఘా వర్గాలు లేకపోవడం కూడా ఓ వైఫల్యంగా భావించిన అధికారులు మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్‌ల ఏర్పాటుపైనా దృష్టి పెడుతున్నట్లు సమాచారం.





## నా భర్త 20 కేజీల
# బరువు తగ్గారు

- వల్లభనేని వంశీ రెండు రోజుల కస్టడీ పూర్తి
- విజయవాడ సబ్ జైలుకు తరలింపు
- తన భర్త ఆరోగ్యం బాగోలేదన్న పంకజశ్రీ
- సీప్యాప్ పరికరంతో శ్వాస తీసుకుంటున్నారని వెల్లడి
- ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం సంతృప్తికరంగా లేదన్న పంకజశ్రీ

వేద న్యూస్, గన్నవరం :

మాజీ శాసనసభ్యుడు, వైసీపీ నేత వల్లభనేని వంశీ రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. బాపులపాడు మండలంలో వెలుగు చూసిన నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసుకు సంబంధించి ఆయనను పోలీసులు విచారించారు. కస్టడీ గడువు పూర్తి కావడంతో, ఆయనను నూజివీడు కోర్టులో ప్రవేశపెట్టి, అక్కడి నుంచి విజయవాడ సబ్ జైలుకు తరలించారు. ఈ రెండు రోజుల విచారణలో భాగంగా, నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై పోలీసులు వంశీని పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. సుమారు 30కి పైగా ప్రశ్నలతో ఈ వ్యవహారంలో ఆయన పాత్రపై ఆరా తీసినట్లు సమాచారం. ముఖ్యంగా, ఈ నకిలీ పట్టాలను ఎక్కడ తయారు చేశారు, ఎవరు తయారు చేశారు, ఎందుకు తయారు చేయాల్సి వచ్చింది వంటి అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. ఈ కుంభకోణంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో కూడా ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ నకిలీ పట్టాలతో తనకు ఎలాంటి సంబంధం లేదని వంశీ పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. మరోవైపు, వంశీ అస్వస్థతకు గురికావడంతో విచారణకు కొంత ఆటంకం కలిగిందని పోలీసు వర్గాలు అంటున్నాయి. ఆయన ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల అనుకున్నంత స్థాయిలో విచారణ జరపలేకపోయినట్లు చెబుతున్నారు. మరోవైపు, కస్టడీ అనంతరం వంశీని కోర్టు నుంచి జైలుకు తరలిస్తున్న సమయంలో ఆయన భార్య పంకజ శ్రీ మీడియాతో మాట్లాడుతూ తన భర్త ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "వంశీ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన సీప్యాప్ పరికరం సహాయంతో మాత్రమే శ్వాస తీసుకోగలుగుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయనకు అందుతున్న వైద్యం పూర్తి స్థాయిలో సంతృప్తికరంగా లేదు" అని ఆమె తెలిపారు. మెరుగైన చికిత్స కోసం ఎయిమ్స్ వంటి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరినట్లు పంకజ శ్రీ చెప్పారు. వంశీ ఆరోగ్యం క్షీణించిందని, ఆయన 105 కేజీల నుంచి 85 కేజీలకు 20 కేజీల బరువు తగ్గిపోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

వేద న్యూస్





## రోడ్లపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

**వేద న్యూస్, కాజీపేట :**

అదాలత్ జంక్షన్లో రోడ్లపై ఉన్న గుంతలను కాజీపేట ట్రాఫిక్ పోలీసులు శనివారం సిమెంట్ కాంక్రీట్ వేసి పూడ్చారు. రోడ్లపై గుంతలు ఉండటం వల్ల ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి పడిపోతున్నాయని గమనించిన కాజీపేట ఎస్సై రావెల్ల రామారావు తన ట్రాఫిక్ సిబ్బందితో కలిసి రెడీమిక్స్ వాహనాన్ని తెప్పించి వారే స్వయంగా రోడ్లు పూడిపించారు. ఈ సందర్భంగా రోడ్డు బాగు చేయించినందుకు ప్రజలు ట్రాఫిక్ పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ పరమేష్, హెూంగార్డ్ కుమారస్వామి, కృష్ణంరాజు, డ్రైవర్ మురళి పాల్గొన్నారు.

## శిరీషరెడ్డికి డాక్టరేట్ ప్రదానం



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వరంగల్ నగరంలోని బొల్లికుంట వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్,ఫార్మకాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శిరీష జన్నపురెడ్డికి తను ప్రచురించిన పరిశోధన గ్రంథానికి శనివారం గౌరవ డాక్టరేట్ పట్టాని అంద చేశారు. శిరీష.జే తన ప్రతిభతో ఏఐసీటీఈ–క్యూఐపీ,గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫెలోషిప్ ప్రోగ్రాంలో ఫుల్ టైం పిహెచ్.డి సీట్ సాధించి ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మాంజిఫెరిన్ లోడెడ్ నానోస్ట్రక్చర్డ్ లిపిడ్ క్యారియర్స్ అగైనెస్ట్ కీమోథెరపీ ఇండ్యూస్డ్ కాగ్నిటివ్ ఇంపెయిర్మెంట్ అనే గ్రంథాన్ని డాక్టర్.నందకుమార్. కె. ప్రొఫెసర్ అండ్ హెడ్,ఫార్మకాలజీ,మణిపాల్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్,మణిపాల్ పర్యవేక్షణలో ఫుల్ టైం పీహెచ్ డి చేశారు.శనివారం మంగళూరులోని డాక్టర్ టీఎంఏ పై ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ముప్పై రెండవ కాన్వోకేషన్ కార్యక్రమంలో పాల్గొని గౌరవ డాక్టరేట్ పట్టాని వైస్ ఛాన్సెలర్ డాక్టర్. ఎం. డి. వెంకటేశ్ చేతుల మీదుగా అందుకున్నారు.




## శుభ కార్యక్రమాలకు హాజరైన నాగుర్ల

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు శనివారం పలు శుభ కార్యక్రమాలకు హాజరయ్యారు. ఎల్కతుర్తి మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు,ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుకినే సంతాజి నివాసానికి వెళ్లి వారి మనవడిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లును సంతాజీ, వారి కుటుంబ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఎల్కతుర్తి మండలంలో ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్లో మాజీ ఎంపీటిసి కడారి రాజు తమ్ముడు కడారి అశోక్ సుజాత కూతురి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, ఆరెకుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోటె చిరంజీవి, భవన నిర్మాణ కమిటీ కోఆర్డినేటర్ కౌడగాని నర్సింగారావు, హింగే భాస్కర్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడలో ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని మున్సిపల్ కమిషనర్కు బీసీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ యువజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు తిరుమలగిరి అంజి మాట్లాడుతూ పట్టణంలో వ్యాపారం చేస్తున్న వ్యాపారులందరు వినియోదారులకు ఇచ్చే ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలి అన్నారు. ఎందుకంటే ప్లాస్టిక్ మానవ మనుగడకి పెద్ద ప్రమాదకరం పొంచి ఉందన్నారు. మిర్యాలగూడలో చిరు వ్యాపారులు, పెద్ద పెద్ద షాపులు వారు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారని, ప్లాస్టిక్ కవర్లు వినియోగించే వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని,వారికి జరినామా కూడా విధించాలని మున్సిపల్ కమిషనర్ని కోరామని తెలిపారు. పుట్టల సందీప్, రాజు, నక్క నాగరాజు, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## బోధనలో మెలకువలు ఉపయోగించాలి

### మండల విద్యాశాఖ అధికారి ఎం.అనురాధ

**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న 5రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం.అనురాధ పాల్గొని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంను ఉద్దేశించి మాట్లాడారు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఈ యొక్క శిక్షణ ఉపయోగించుకుని బోధనలో కొత్త మెలకువలు ఉపయోగించి విద్యార్థులు అన్ని సబ్జెక్టుల వారిగా అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల యొక్క ఎన్రోల్మెంట్ పెంచే విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలల యొక్క అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# చర్చి ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, కాజీపేట :**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కాజీపేట 62 వ డివిజన్ రహమత్ నగర్లో రూ.15 లక్షలతో సిఎస్ఐ సెయింట్ జాన్స్ చర్చి ప్రహరీ నిర్మాణం కోసం ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేసి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానిక మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. సకాలంలో ప్రహరీ నిర్మాణం పనులు పూర్తి చేయాలని,కావాల్సిన ఏర్పాట్లు చూడాలని స్థానిక నాయకులకు ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 62,63 వ డివిజన్ల కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్ చుంచు అశోక్, కుమ్మరి సాంబయ్య, మహమ్మద్ అంకుష్, మైసరపు సిరిల్ లారెన్స్, 61 డివిజన్ అధ్యక్షులు రమేష్, చిలువేరు విజయ భాస్కర్, దొంగల కుమారస్వామి, ఇప్ప శ్రీకాంత్, తిరుపతి, శ్రీనివాస్, పోగుల శ్రీనివాస్, మాతంగి స్వామి, శోభన బోయిన బిక్షపతి, శివరాం, సి ఎస్ ఐ సెయింట్ జోన్ చర్చ్ పాస్టర్, విక్టర్ పాల్, కృపమ్మ, కోశాధికారి ధర్మరాజు, మహిళ సెక్రెటరీ ప్రణామిక, లారెన్స్, ప్రాపర్టీ సెక్రటరీ యేసు రాజు, దేవ, దుష్మన్, కమల, రవి, ఏసు, మని, పరంజ్యోతి, విజయ, మంద సుధాకర్, రామ్, రమా, జ్యోతి, రమాజ్యోతి, అనూష, మధుకర్, సువర్ణ, ప్రేమ్ కుమార్, మనోహర్, మోజెస్, గోపి, కృపాజీ, అధికారులు, కాజీపేట సిఐ సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యే పి ఎ కిరణ్, ఏఈ అజిత్ ఖాన్ పాల్గొన్నారు.

# శాంతి సామరస్య స్థాపనకై కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు

■ **న్యాయమూర్తి వీబీ నిర్మల గీతాంబా**

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**




సమాజంలోని వివిధ రకాల వ్యక్తులు మధ్య నెలకొన్న వివాదాలను సామరస్యంగా శాంతిపూర్వకంగా పరిష్కరించినట్లయితే సమాజంలో శాంతిభద్రతలు పరిఢవిల్లుతాయని వీటి కోసం కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు ఎంతగానో ఉపయుక్తమని వరంగల్ జిల్లా న్యాయమూర్తి వీబీ నిర్మల గీతాంబా అన్నారు. శనివారం వరంగల్లులో మూడు కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను న్యాయమూర్తి ప్రారంభించారు. ఎల్.బి. నగర్ లో ముస్లిం కమ్యూనిటీ సెంటర్, బాపూజీ భవన్ లో ఆల్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్, పాపాయిపేట్ చమన్ లో వాసవి మీడియేషన్ సెంటర్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వహక అధ్యక్షులు జస్టిస్ సుజోయ్ పాల్ ఆదేశాల మేరకు ఈ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా సెంటర్లలో మధ్యవర్తులుగా వ్యవహరించే పెద్దమనుషులకు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఇదివరకే మూడు రోజుల శిక్షణ ఇచ్చినట్లు ఆమె ప్రకటించారు. ఈ కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రాల్లో ఎవరైనా తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని అట్టివారికి ఉచితంగా సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తారని అన్నారు. ఏదైనా సమస్యలు పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాలకు వెళ్లినట్లయితే ఇరుపక్షాల మధ్య కక్షలు కార్పణ్యాలు ఇంకా పెరిగిపోయే అవకాశం ఉంటుందని అందుకే ఈ కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించే ప్రయత్నం చేస్తారని, అందువల్ల ఇరుపక్షాల మధ్య స్నేహబంధం బలపడుతుందన్నారు. పోలీస్ స్టేషన్లకు మరియు రెవిన్యూ అధికారుల వద్దకు వచ్చే తగాదాలను ఈ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లకు పంపించడం ద్వారా రాజీమార్గంలో పరిష్కరించే ప్రయత్నం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ విధంగా మధ్యవర్తిత్వ కేంద్రాలలో పరిష్కరించబడిన వివాదాలకు లోక్ అదాలత్ ద్వారా తీర్పులను జారీ చేస్తారని, ఇవి అంతిమమైన అప్పిలు రహితమైన తీర్పులని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. సాయికుమార్ ఆయా కమ్యూనిటీ పెద్దలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో జోడెడ్లలా సంక్షేమం..!

మొదటి పేజీ తరువాయి

ప్రాధాన్యత నిస్తూ పాలన సాగిస్తుందని అన్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా నిరుపేదలకు ఉగాది నుండి సన్న బియ్యం సరఫరా చేస్తుందని, ఇందిరమ్మ కమిటి అందించిన జాబితా ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడతలో నిరుపేదలకు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం క్రింద యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చామని, యాసంగి సీజన్ లో కూడా రైతులకు బోనస్ చెల్లిస్తామని అన్నారు. రైతులకు ఉన్న భూ సమస్యలను అధికారులు నేరుగా గ్రామాలకు వచ్చి పరిష్కరించే దిశగా భూ భారతి చట్టం ద్వారా చర్యలు తీసుకున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ క్రింద పేద కుటుంబానికి కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని అన్నారు. పేదల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, గ్రామీణ నిరుపేదలకు ఇచ్చిన భరోసా ప్రకారం చిత్తశుద్ధితో పనిచేస్తామని, ఇచ్చిన ప్రతి మాటను పేదవానికి చేర్చడానికి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి అన్నారు. మంత్రి తన పర్యటనలో పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏడిఏ సరిత, తిరుమలాయపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడివో సిలార్ సాహెబ్, కూసుమంచి మండల ఇన్ చార్జి తహశీల్దార్ కరుణశ్రీ, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించండి

### కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, డెస్క్:**



హైదరాబాద్ నగరానికి మరో 800 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌కు 2 వేల ఈవీ బస్సులు కేటాయించారని, ప్రస్తుత నగర అవసరాలను దృష్టిలో పెట్టుకొని పీఎం–ఈ డ్రైవ్ పథకం కింద అదనంగా మరో 800 బస్సులు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు బస్సు నిర్వహణ చూసేలా హైబ్రిడ్ జీసీసీ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ డీజిల్ బస్సుకు రెట్రోఫిట్టెడ్ చేపట్టగా అది సఫలమైందని, ఆ బస్సు నగరంలో రాకపోకలు సాగిస్తోందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు రెట్రో ఫిట్‌మెంట్ అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి:**



మిర్యాలగూడ దామరచర్ల, అడవిదేవులపల్లి మండల కేంద్రాలలోని ఉపాధ్యాయులకు నిర్వహించబడుతున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమ ముగింపులో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత పూజింపబడే స్థానం ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి ఉత్తమమైనవిద్యా హామీనీ ఇచ్చి విద్యార్థులను చేర్పించాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో ఎక్కువగా విద్యార్థులను నమోదు చేయించిన ఉపాధ్యాయులను గుర్తించి కనివిని ఎరుగని రీతిలో ఉపాధ్యాయ దినోత్సవం రోజు సన్మానిస్తామని, ఉపాధ్యాయులందరూ పోటీపడి పనిచేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో దశలవారీగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.అనంతరం ఐదు రోజులు క్రమశిక్షణతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను,శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్ లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు బాలాజీ నాయక్,వరలక్ష్మి,బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ..కార్యక్రమాలు చేస్తే ఊరుకోం..

మొదటి పేజీ తరువాయి

నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కమ్యూనిస్టుల ఐక్యత ఓంకార్ ఆశయాలపై ఎంత మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే ఎంసిపిఐ పేరుతో జరిపే మహాసభలను రద్దు చేసుకొని కలసి రావాలని కోరారు. లేకపోతే ఓంకార్ ప్రస్తావన లేకుండా ఫోటో వాడకుండా ఓంకార్ నిర్మించిన ఎంసిపిఐ పేరు తీసివేయాలని అలా జరగని పక్షంలో తగిన విధమైన కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరించారు. మార్క్సిస్టు పద్ధతులకు, ఓంకార్ కలలు కన్నా రాజ్యస్థాపనకు నిర్మాణాయుత పోరాటాలకు పార్టీ కార్యక్రమానికి కట్టుబడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ఎంసిపిఐ(యు) తగిన విధమైన గుర్తింపు గౌరవాన్ని ఇస్తుందని ఆదిశలో కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ముందు ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు కంచ వెంకన్న, నీల రవీందర్, కన్నం వెంకన్న, నర్ర ప్రతాప్, కుసుంబ బాబూరావు, నాగార్జున, సావిత్రి, సుంచు జగదీశ్వర్, మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ రాజా, సాహెబ్, ఐతం నాగేష్, మాలి ప్రభాకర్, అప్పనపురి నరసయ్య, కలకోట్ల యాదగిరి, మంద భద్రయ్య, నలివెల రవి పాల్గొన్నారు.

## అభివృద్ధి వేగం పెరగాలి

మొదటి పేజీ తరువాయి

పాలనాపరమైన ప్రాధాన్యతలపై చర్చించడానికి ఈ వేదిక నుంచి మాట్లాడటం గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నానంటూ..ముందుగా పహల్గామ్ ఘటనను తీవ్రంగా ఖండించారు. "పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటనను తెలంగాణ ప్రజలు తీవ్రంగా ఖండించారన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో దేశ సాయుధ దళాలు చేపట్టిన ప్రతి చర్యకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.

దేశంలో శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్న సంకల్పానికి తెలంగాణ కట్టుబడి ఉంది. మన వీరుల ధైర్యానికి, త్యాగాలకు వందనాలు. 1971 లో పాకిస్థాన్ తో జరిగిన యుద్ధంలో దేశానికి చిరస్మరణీయ విజయం అందించిన మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నాయకత్వాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవడం సముచితం" అని అన్నారు. "దేశ స్వాతంత్రం సాధించి వందేళ్లయ్యే 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో కూడిన వికసిత్ భారత్ లక్ష్యాలను నిర్దేశించుకోవడం స్ఫూర్తిదాయకమని ఆ లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం మనకుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రయాణంలో ముందువరుసలో నడవడానికి కీలక పాత్ర పోషించడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. దేశం రాష్ట్రాల సమాఖ్య అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల సమగ్ర, స్థిరమైన అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారమవుతుందని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ మడికొండ గ్రామ శాఖ అధ్యక్షునిగా యాదగిరి

**వేద న్యూస్, మడికొండ :**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, బీఆర్ఎస్ మడికొండ గ్రామ శాఖ అధ్యక్షునిగా పల్లపు యాదగిరి ఎన్నికయ్యారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అధ్యక్షతన ఈ గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులుగా గోపనబోయిన రాజు, వస్కుల దేవేందర్, బుర్ర రమేష్, కాళేశ్వరపు రాజు, మాచర్ల విజయ్, దేవేందర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గంగారపు వీరేష్, తండ శంకర్, భూపాల్ రెడ్డి, తుర్పాటి అబ్బ సాయిలు, బుర్ర రాజ్ కుమార్, నూక కిషన్, రాజు, ఫారుక్, వస్కుల రమేష్, బరిగెల కృష్ణ మూర్తి, పల్లపు రాజ్ కుమార్, వల్లెపు రమేష్, ఆరూరి రాజేందర్, బత్తిని కిరణ్, బుర్ర నరేష్, వస్కుల నరసయ్య, నమిండ్ల ప్రభాకర్, నర్మేట బిక్షపతి, పల్లపు రాజేందర్, పల్లపు రామరాజు, బోసు రాము, ఎత్తరి రాజు, ఆరూరి తిరుపతి, మద్దెల కుమార్ స్వామి, ఆరూరి రమేష్, చేను రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073